
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

శుక్రవారం 18 ఏప్రిల్ 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్లు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 23.4

అంగన్‌వాడీలా

- అద్దెభవనాల్లో కేంద్రాల నిర్వహణ
- రేకులషెడ్లు, ఇరుకు గదులతో చిన్నారులకు ఇక్కట్లు
- వేసవి ఉక్కపోతతో తల్లడిల్లుతున్న పిల్లలు



ఉక్కపోతతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అసౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాల్లో ఇప్పటికే చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, వేసవి కాలం కావడం తో ఉక్కపోతకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చాలాచోట్ల అద్దె భవనాల్లోనే కేంద్రాలు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రేకుల షెడ్డులో కేంద్రాలు ఉండటంతో గదిలో వేడిమికి చిన్నారులు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా పట్టణాల్లో చెల్లించే అద్దె తక్కువగా ఉండటంతో అన్నిసౌకర్యాలు ఉన్న భవనాలు దొరకడం లేదు. దీంతో చిన్నగదుల్లో పెద్దసంఖ్యలో పిల్లలతో నిర్వవహిస్తున్న కేంద్రాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.

- వివరాలు 6లో

అక్కడ టెక్నీషియనే డాక్టర్



చికిత్స కోసం వెళ్లే ముందు వైద్యుడి అర్హతలను చూస్తుంటాం.. అందుకే ఆసుపత్రుల్లో పెద్దపెద్ద అక్షరాలతో వైద్యుల పేర్లతో పాటు వారు సాధించిన డిగ్రీలతో బోర్డులుంటాయి. అతడి చేతితో ఇచ్చే ఏ ఔషధమైనా మన అనారోగ్యాన్ని మాన్పి ఆరోగ్యాన్ని తీర్చిదిద్దుతుందని భావిస్తుంటాం. అయితే ఆసుపత్రుల్లో బోర్డులపై పేర్కొంటున్న వైద్యులు చికిత్సలు అందించడంలో కనిపించడం లేదు. జూనియర్ వైద్యులతో పాటు టెక్నీషియన్లతో వైద్యం అందిస్తూ కాసులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇటువంటి ఉదంతమే బుధవారం సూర్యాపేటలో వెలుగుచూసింది.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

» ఆసుపత్రి బోర్డుపైనే వైద్యులు » శరత్ కార్డియాక్ సెంటర్ సీజ్ » వైద్యుడిగా టెక్నీషియన్ విధులు » వైద్యుల బృందం తనిఖీల్లో వెలుగులోకి

జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో కొత్తగా చాలా ఏర్పాటుచేశారు. కేవలం సూర్యాపేటలోనే కాకుండా కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరిలో సైతం ప్రైవేట్ ఆసుపత్రుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ వాటిలో నిబంధనలు ఏమాత్రం పాటించడం లేదు. ఆసుపత్రి నిర్వాహకులు ఎటువంటి అనుమతులు లేకుండానే ఆసుపత్రులను ఏర్పాటుచేస్తున్నారు. వీరలైతే ఔషధ దుకాణాలు, డయాగ్నస్టిక్ సెంటర్లలో భాగస్వాములను కూడా చేస్తున్నారు. అయితే ఆసుపత్రులల్లో డయాగ్నస్టిక్ సెంటర్లు నిర్వహిస్తున్న వారిలో చాలా మంది ఆయా రంగంలో నిష్ణాతులు కారని, కనీసం ఆయా కోర్సులు కూడా చేసి ఉండటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేసే సందర్భాల్లో సర్టిఫికెట్ ఒకరిది ఉంటుండగా, అక్కడ చేసే వారు మరొకరు ఉంటున్నారు.



బోర్డులోనే కార్డియాలజిస్ట్.. చేసేది టెక్నీషియన్

జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో అర్హులైన గుండె వైద్య నిపుణుడు లేకుండానే టెక్నీషియన్ స్కాన్ చేసి వైద్యుడి పేరు మీద రిపోర్ట్ ఇస్తున్న వైనం బుధవారం వెలుగు చూసింది. స్థానిక శరత్ కార్డియాక్ సెంటర్‌పై ఫిర్యాదుల నేపథ్యంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృంద సభ్యులు డాక్టర్ వీ నరేష్‌కుమార్, డాక్టర్ ఎం.రాజీవ్ నేతృత్వంలోని బృందం తనిఖీలు నిర్వహించింది. రిజిస్టర్ చేసుకున్న కార్డియాలజిస్టు వైద్యుడు లేకుండానే టెక్నీషియన్ తాను కూడా వైద్యుడి అని పేర్కొంటూ రోగులకు రిపోర్ట్ అందిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. శరత్ కార్డియాక్ సెంటర్‌కు ప్రీ కాన్సెప్షన్, ప్రీ నటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్(పీసీపీఎన్‌డీటీ) చట్టం ప్రకారం కార్డియాలజిస్టు డాక్టర్ లీలకృష్ణ పేరు మీద అనుమతి తీసుకున్నారు. కానీ టెక్నీషియన్ వైద్యురాలు లీల లేకుండానే 2డీ ఈకో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

దీంతో టెక్నీషియన్ వనం శరత్‌చంద్రపై ఎన్‌ఎంపీసీ చట్టం ప్రకారం, ఫోర్జరీ కేసు నమోదు చేసి ఆసుపత్రిని సీజ్ చేశారు. అయితే ఇలా బోర్డుపై ఉన్న వైద్యురాలు ఆసుపత్రిలో వైద్యం చేయకుండ టెక్నీషియన్‌తో చేయిస్తున్నట్లు జిల్లాలో అనేక ఆసుపత్రులపై ఆరోపణలు ఉన్నాయి. వీటిపైనా అధికారులు దాడులు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

డబ్బులున్నాయా, ఆసుపత్రి పెట్టెయ్

ఒకప్పుడు సేవాగుణంతో ఆసుపత్రులను ఏర్పాటుచేసేవారు. ప్రస్తుతం డబ్బు సంపాదనే లక్ష్యంగా ఆసుపత్రులు ఏర్పాటవుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. డబ్బులుంటే లేదా డబ్బులున్న నలుగురు కలిస్తే చాలు ప్రైవేట్ ఆసుపత్రులను ఏర్పాటుచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 410కి పైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ఇందులో సూపర్ స్పెషలిటీ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు, డయాగ్నస్టిక్ సెంటర్లు, దంత వైద్యశాలలు, ఈఎన్‌టీ, ప్రైవేట్ క్లినిక్‌లు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో సుమారు 180 దాకా ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ అనుమతులు లేనివి ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక ఆసుపత్రుల నిర్వాహకులు రోగుల కోసం గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలతో కమీషన్లు మాట్లాడుకుని రోగులను ఆసుపత్రులకు రప్పించుకుంటున్నారు. ఆసుపత్రికి వెళ్లగానే సంబంధం లేని పరీక్షలు చేసి అనవసరంగా డబ్బులు వసూలు చేస్తూ అందులోంచి ఆర్‌ఎంపీలకు 20 నుంచి 40 శాతం కమీషన్ చెల్లిస్తున్నారు. కొంతమంది ఆర్‌ఎంపీలు గ్రామంలో ప్రథమ చికిత్స చేస్తే రాని డబ్బులు పట్టణాల్లో ఉన్న ఆసుపత్రి నిర్వాహకులు ఇస్తుండడంతో చిన్న వ్యాధికి సైతం పట్టణాలకు పంపించేందుకు వారు మొగ్గు

- మిగతా 8వ పేజీలో...

భూనిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించండి



భూనిర్వాసిత రైతులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెర్వు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ నూతన నిర్మాణంలో భాగంగా భూమి కోల్పోతున్న రైతుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని జలసౌధలో చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన భూనిర్వాసిత రైతులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి భూసమస్యలు, గతంలో ఉన్న ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.24 లక్షల పరిహారం గురించి వివరించిన రైతులు ఒక కుంటకు రూ.లక్ష ఇప్పించాల్సిందిగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన మంత్రి ఉత్తమ్ ఇరిగేషన్ ఈఈ రమేష్‌బాబు, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో మాట్లాడి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, నష్టపరిహారం పెంపుదల విషయంలో పునరాలోచన చేసి సాధ్యమైనంత వరకు పరిహారం పెంచేలా చూడాలని ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో రైతులు లక్ష్మారెడ్డి, ఇంద్రారెడ్డి, మౌలాలి, రామ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాంబాయి అన్నారు. రైతులపై అదనపు భారం' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతి మినీలో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు ఆమెను పరిశీలనకు పంపించారు. మండలంలోని బూరుగడ్డ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకే లారీలు వస్తాయన్నారు. అందుబాటులో ఉన్న రైతులు లారీల ద్వారా ఎఫ్‌సీఐ గోడౌన్‌కు ధాన్యం తరలించుకోవచ్చన్నారు. ధాన్యం తరలించే ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన పని లేదన్నారు. ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి రైతులు, హమాలీల మధ్య ఒప్పందం జరిగిందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. వాతావరణం సమస్యతో వర్షాలు పడుతున్నందున సొంతఖర్చులతో కొంతమంది రైతులే ట్రాక్టర్ల ద్వారా గోడౌన్లకు ధాన్యం తరలిస్తున్నారన్నారు. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు భరించలేని రైతులకు లారీలు ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవో కీర్తి వెంకటేశ్వర్లు, రైతులు గువ్వల వీరయ్య, మాడుగుల పరశురామ్, యరగాని వెంకన్న, శ్రీనివాసు, వీరబాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నివేదిక అందిస్తాం

బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో వేణుమాధవ్

తుంగతుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తుంగతుర్తి ఎస్సీ బాలికల వసతి గృహంలో పరిస్థితులపై నివేదికను తయారుచేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఆర్డీవో వేణుమాధవ్ తెలిపారు. వసతి గృహంలో రిజిస్టర్‌లో ఉన్న విద్యార్థుల కంటే తక్కువగా ఉండటంపై ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నెల 15న ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో వసతి గృహానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశాల మేరకు ఆర్డీవో గురువారం హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ పరిసరాలతో పాటు వంట గది, స్టోర్‌రూంతో పాటు రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్యకు హాస్టల్‌కు వస్తున్న విద్యార్థుల సంఖ్యకు పొంతన ఎందుకు లేదని, విద్యార్థులు రాత్రి వేళలో ఎందుకు ఉండటంలేదని వార్డెన్‌ను ప్రశ్నించారు. హాస్టల్‌కు ఎదురుగా శ్మశానవాటిక ఉందని దాంతో పిల్లలు ఉండడం లేదని ఆమె తెలిపారు. దీంతో ఆయన క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. రికార్డులో రాసిన విద్యార్థుల కన్నా తక్కువ మంది ఉన్నట్లు తెలిసిందని ఆర్డీవో తెలిపారు. గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని, జరిగిన సంఘటనపై రికార్డులను పంచనామా చేసి కలెక్టర్‌కు నివేదికను అందజేస్తానన్నారు. ఆయన వెంట తహసీల్దార్ దయానందం, ఎస్సీ కార్పొరేషన్ డీఈ లత, ఆర్ఐలు అంజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సత్వర న్యాయంకోసం నూతన కోర్టులు

» పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి: హైకోర్టు జస్టిస్ రాధారాణి » హుజూర్‌నగర్‌లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం



కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్యామ్‌శ్రీ, పక్కన కలెక్టర్, ఎస్పీ

హుజూర్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు నూతన కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ రాధారాణి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణానికి మంజూరైన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును గురువారం హైకోర్టు న్యాయమూర్తులు వినోద్‌కుమార్, లక్ష్మణ్, సృజనలతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్ కేసులు అత్యధికంగా ఉండగా వాటిని సత్వరమే పరిష్కరించేందుకు నూతన కోర్టు మంజూరు చేసినట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి సూచన మేరకు నూతన కోర్టు మంజూరు చేశామని వెల్లడించారు. ఈ కోర్టును ప్రారంభించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నూతన కోర్టును ప్రారంభిస్తేనే జడ్జిని కేటాయించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అనేక కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులు కృషి చేస్తున్నారని తెలిపారు. కేసుల పరిష్కారంలో న్యాయవాదుల సహకారం కూడా ఎంతో కీలకమన్నారు.


ఆశ్చర్యానికి గురయ్యాం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 వేల కేసులు పెండింగ్‌లో ఉండగా ఒక్క హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోనే 8,500 కేసులు పెండింగ్‌లో ఉండడం ఆశ్చర్యానికి గురిచేసిందని హైకోర్టు న్యాయమూర్తి జడ్జి జస్టిస్ సృజన అన్నారు. పెండింగ్ కేసుల భారాన్ని పరిగణలోకి తీసుకుని బార్ అసోసియేషన్ విన్నపం మేరకు నూతన కోర్టును మంజూరు చేశామన్నారు. కాగా పట్టణంలోని నూతన కోర్టును జిల్లా ప్రధానన్యాయమూర్తి శ్యామ్‌శ్రీ, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి శ్యామ్‌శ్రీని న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జిలు జిట్టా శ్యాంకుమార్, సురేష్, పర్విన్‌కౌసర్, జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, న్యాయవాదులు కాలువ శ్రీనివాసరావు, నట్టె సత్యనారాయణ, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, నారపరాజు శ్రీనివాసరావు, బాలకృష్ణ, కృష్ణయ్య, రేణుకదేవి, రవికుమార్, సుందర్, రమాదేవి పాల్గొన్నారు.

నెరవేరిన న్యాయవాదుల కోరిక

హుజూర్‌నగర్ ప్రాంత న్యాయవాదుల చిరకాలవాంఛ నూతన కోర్టు ప్రారంభంతో నెరవేరినట్లు భావిస్తున్నామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ అన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు 3,067 కేసులు కేటాయించినట్లు తెలిపారు. పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెర్వు, చింతలపాలెం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సివిల్ కేసులు మొత్తం ఈ కోర్టుకు కేటాయించామన్నారు. న్యాయమూర్తుల ఎంపిక కోసం పరీక్షలు రాసిన అభ్యర్థులలో అనుకున్న స్థాయిలో న్యాయమూర్తులుగా ఎంపిక కాకపోవడం మూలంగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయలేకపోతున్నామన్నారు. న్యాయవాదులు పోటీ పరీక్షల్లో పాల్గొని కష్టపడి చదివి న్యాయమూర్తులుగా ఎంపికైతే న్యాయమూర్తుల కొరత తీరుతుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చాలా కోర్టుల్లో న్యాయమూర్తుల ఖాళీల కొరత ఉందన్నారు. త్వరలోనే నూతన కోర్టుకు పూర్తిస్థాయి జడ్జిని నియమిస్తామన్నారు.

సోనియా,రాహుల్‌పై చార్జిషీట్‌ను ఉపసంహరించుకోవాలి



జిల్లా కేంద్రంలోని నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు రాజేశ్వరరావు తదితరులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీపై వేసిన చార్జిషీట్‌ను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికా ర ప్రతినిధి చకిలం రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువా రం జిల్లా కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయ ప్రాంతంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విపక్షాల గొంతు అణిచివేయాలని చూస్తోందని మండిపడ్డారు. సోనియా, రాహుల్‌గాంధీలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను జవహర్‌లాల్‌నెహ్రూ స్థాపించారని, అది కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారని, ఆ పత్రికను నష్టాలు రావడంతో మూసివేశారన్నారు. ఈ ఆస్తులకు సంరక్షకులుగా ఉన్న నేటి తరం కాంగ్రెస్ నేతలు వాటిని ఇతరత్రా కార్యక్రమాలకు వాడుకుంటే తప్పేంటో బీజేపీ ప్రభుత్వం చెప్పాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, అబినయ్, బైరు శైలేందర్‌గౌడ్, వేణుగోపాల్, మా ణిక్యం, వీరన్ననాయక్, రమేష్, బాలుగౌడ్, శబరినాథ్, వాసు, రవి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రఘు, శ్రీనివాస్, నర్సయ్యయాదవ్, రాము, కరుణాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, నరేష్‌పిళ్ళై, శిరీష, సంజయ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం ఆరోగ్యానికి శ్రేయస్కరం



పెన్‌పహాడ్‌లో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న వివిధ శాఖల అధికారులు

పెన్‌పహాడ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం ఆరోగ్యానికి చాలా శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో సుబ్బలక్ష్మి అన్నారు. గురువారం పెన్‌పహాడ్ మండలకేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషకపక్షంలో భాగంగా పోషకపదార్థాల ప్రదర్శనను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణలోపం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతీ కుటుంబంలో పోషకాహారం గురించి తెలిసేలా అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ ధరావత్ లాలు నాయక్, పీహెచ్ఎన్. శశిరేఖ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హనీఫా, స్వప్న, కే చంద్రిక, బ్లాక్ కోఆర్డినేటర్ కే ఝాన్సీ, ఏపీఎం అజయ్‌నాయక్, ఏపీవో రవి, కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారం



నేరేడుచర్లలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్


నేరేడుచర్ల / గరిడేపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలు భూభారతి చట్టంతో పరిష్కారం కానున్నాయని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. గురువారం భూభారతి చట్టంపై నేరేడుచర్ల, గరిడేపల్లిలలో నిర్వహించిన అవగాహన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గరిడేపల్లిలో ఎస్పీ నర్సింహతో కలిసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం గురించి పూర్తిస్థాయిలో రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ధరణిలో చాలా సమస్యలు పరిష్కరించలేనివి ఉన్నాయన్నారు. కానీ భూభారతి చట్టం ద్వారా అధికారం వికేంద్రీకరణ జరుగుతుందని సమస్యను బట్టి తహసీల్దార్, ఆర్‌డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించవచ్చని ఆయన తెలిపారు. భూభారతి చట్టం అమలులో భాగంగా వారసత్వం, పౌతి అమలు చేసేటప్పుడు గ్రామాల్లో నోటీసులు ఇచ్చి వారం గడువు ఇస్తామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చన్నారు. ధరణిలో ఆ అవకాశం లేదన్నారు. పెద్దపెద్ద సమస్యలుంటే రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటైందని, అక్కడైనా పరిష్కరించుకోవచ్చన్నారు. సరిహద్దులు నిర్ణయించి సమస్యలు పరిష్కరిస్తామని, సర్వేనెంబర్లలో తప్పులు ఉన్నా, మిస్సింగ్ నెంబర్లు ఉన్నా, భూమి ఒక చోట ఉండి సర్వేనెంబర్ వేరేదిగా ఉన్నా ఆ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. భూభారతి చట్టం గురించి సెక్షన్ల వారీగా రైతులకు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పర్సు రాంబాబు, ఆర్డీవో శ్రీనివాసులు, ఏడీ రవి, తహసీల్దార్లు సురిగి సైదులు, బండ కవిత, ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి, ఏపీఎం నాగేందర్, ఏవో జావిద్, డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, కమిషనర్ అశోక్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, బచ్చలకూరి ప్రకాష్, కొణతం చినవెంకటరెడ్డి, రణపంగ నాగయ్య, బాషా, శ్రీనివాసరెడ్డి, గరిడేపల్లి మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్‌ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్లు జుట్టుకొండ సత్యనారాయణ, గంటా సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, షేక్ చాంద్‌మియా, పాకాల పరమేష్, కటకం రమేష్, గుండు రామాంజి, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

టోల్‌గేటు రుసుము నుంచి మినహాయించాలి

స్థానికులకు టోల్‌గేటు రుసుము మినహాయింపు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ నేరేడుచర్లలోని స్థానిక ప్రజలు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆలగడప టోల్‌గేట్ కేవలం 6 కిలోమీటర్ల దూరంలో ఉందని నేరేడుచర్ల నుంచి నిత్యం మిర్యాలగూడకు వెళ్తుంటారని, అందుకే ఇక్కడి వారికి టోల్ రుసుము లేకుండా చేయాలన్నారు. టోల్ సిబ్బందికి లేఖ రాస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, కొణతం చినవెంకటరెడ్డి, తాళ్ల సురేష్‌రెడ్డి, యారవ సురేష్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అరుణ్‌కుమార్

వైస్‌చైర్మన్‌గా ఆదూరి స్రవంతిరెడ్డి



హుజూర్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత పాలకవర్గానికి మోక్షం కలిగింది. చైర్మన్ పదవి కోసం చాలామంది పోటీపడగా బ్రాహ్మణ సామాజిక వర్గానికి చైర్మన్, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మహిళకు వైస్‌చైర్మన్ పదవి వరించింది. మంత్రి ఉత్తమ్ అనుచరుడిగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న బూరుగడ్డ మాజీ సర్పంచ్ దేశ్‌ముఖ్ అరుణ్‌కుమార్ చైర్మన్‌గా నియమితులయ్యారు. గురువారం ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్‌చైర్మన్‌గా మఠంపల్లి మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా ముత్యాలపాటి నాగులమీరా, బత్తుల సైదిరెడ్డి, తొడేటి శ్రీనివాసరావు, మోదాల వెంకన్న, లచ్చుమళ్ళ నాగేశ్వరరావు, గుజ్జుల కొండారెడ్డి, నట్టె జానకిరాములు, నందిపాటి కోటయ్య, భూక్యా రేసాయి, చక్కెర వెంకటరెడ్డి, మట్టపల్లి వెంకటనారాయణ, గుండా శ్రీనివాసరావు, అదేవిధంగా కోఆప్షన్ సభ్యులుగా మునిసిపల్ ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా అధికారి, మఠంపల్లి పీఏసీఎస్ చైర్మన్లు నియమించారు. ఇదిలా ఉండగా రైతు సంక్షేమానికి కృషి చేస్తానని చైర్మన్‌గా నియామకమైన అరుణ్‌కుమార్ అన్నారు.

అంగన్‌వా'డీలా'

» భానుడి భగభగ.. చిన్నారులు విలవిల » ఉక్కపోతతో తల్లడిల్లుతున్న చిన్నారులు



మిర్యాలగూడలోని గాంధీనగర్‌లో రేకులగదిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

అరకొర సౌకర్యాల నడుమ అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతు న్నాయి. ఇరుకు గదుల్లో అసౌకర్యాల నడమ నిర్వాహకులు కాలం వెళ్ల దీస్తున్నారు. రోజురోజుకు ఎండవేడి మి పెరుగుతుండటంతో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందిని ఎదుర్కొం టున్నారు. అద్దె చెల్లింపు స్వల్పంగా ఉండటంతో పట్టణాల్లో సౌకర్యాలు ఉండే గదులు లభించడం లేదు. దీంతో చిన్నపాటి గదుల్లోనే కేంద్రాల నిర్వహణ జరుగుతోంది. దీంతో చిన్నారులు ఎండవేడిమికి డీలాపడి పోతున్నారు.

ఆంధ్రజ్యోతి విజిట్

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్)
రోజురోజుకూ ఎండవేడిమికి పెద్దలు తల్లిడిపోతుంటే చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే కిశోర బాలబాలికలు ఇరుకు గదుల్లో ఇబ్బందిపడుతున్నారు. పౌష్టికాహార తయారీకోసం గ్యాస్ బండ మంట తోడై గదులు వేడెక్కుతున్నాయి. ఈ పరిస్థితి ప్రధానంగా అద్దెభవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజా ప్రతినిధులు, పాలకులు శీతకన్ను ప్రదర్శిస్తున్న నేపథ్యంలో చిన్నారులకు అగచాట్లు తప్పడంలేదు. గదుల్లో ఫ్యాన్లు సరిగ్గా పనిచేయడంలేదు. గాలి, వెలుతురు కరువయ్యాయి.

ఒక్క వేములపల్లి మండలంలోనే పక్కాగా...

మిర్యాలగూడ ప్రాజెక్టుపరిధిలో 462అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మిర్యాలగూడ, మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టుల పరిధిలో 119 కేంద్రాలు మాత్రమే పక్కా భవనాల్లో కొనసాగుతుండగా, 189కేంద్రాలను అద్దెభవనాల్లో నడిపిస్తున్నారు. మరో 154కేంద్రాలు ఉచిత భవనాల్లో పనిచేస్తున్నాయి. మిర్యాలగూడ ప్రాజెక్టు పరిధిలోని వేములపల్లి మండలంలో పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు పక్కా భవనాల్లో కొనసాగుతున్నాయి. మాడ్గులపల్లి, దామరచర్ల, మిర్యాలగూడ రూరల్, అర్బన్, అడవిదేవులపల్లి, త్రిపురారం మండలాల పరిధిలో అద్దె భవనాల్లో కేంద్రాలు పనిచేస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకటిగదుల్లో తీవ్ర అసౌకర్య పరిస్థితుల నడుమ చిన్నారులు కాలం వెళ్లదీస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు 14,587మంది కిశోర బాలబాలికలు పూర్వవిద్యాభ్యాసం చేస్తుండగా సిబ్బంది కొరత వెంటాడుతోంది. ప్రాజెక్టు పరిధిలో 176 పోస్టులు ఖాళీగాఉన్నాయి. అందులో 26 కేంద్రాల్లో టీచర్ల కొరత ఉండగా, 150 ఆయా పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. సిబ్బంది కొరత కారణంగా చిన్నారుల ఆలనాపాలన గాడి తప్పి అస్తవ్యస్తంగా తయారవుతోంది. సిబ్బంది కొరత ఏర్పడిన కేంద్రాలను సమీప కేంద్రాల్లో విలీనం చేయడంతో చిన్నారుల సంఖ్య పెరిగి గదులు ఇరుకగా మారుతున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం



మిర్యాలగూడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. పక్కాభవనాల కోసం అవసరమయ్యే నిధుల కోసం ప్రతిపాదనలను గతంలో అందజేసి, నిధుల మంజూరుకు ఎదురుచూస్తున్నాం. పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నాం. కరెంటు సదుపాయంలేని కేంద్రాలకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి కరెంట్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాం.
- చంద్రకళ (సీడీపీవో, మిర్యాలగూడ)

సూర్యాపేట జిల్లాలోనూ..

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)
సూర్యాపేట జిల్లాలో మొత్తం 1,209 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో 347 కేంద్రాల్లో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఇరుకు గదులు, అసౌకర్యాల మధ్య కేంద్రాల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలం కావడంతో చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ పరిధిలోని కేంద్రాల్లో 43,962 మంది చిన్నారులు వస్తున్నారు. గర్భిణులు 5,799, బాలింతలు 5,005 మందికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

నకిరేకల్ నియోజకవర్గంలో..

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)
అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు ఉన్నా కొన్నిచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. ముఖ్యంగా అద్దె భవనాల్లో కొనసాగిస్తున్న కేంద్రాల్లో అరకొర వసతులు మధ్య నిర్వహణ కొనసాగుతోంది. మినీ అంగన్‌వాడీలను ప్రభుత్వం గతేడాది అంగన్‌వాడీలుగా గుర్తించింది. అయితే మినీ అంగన్‌వాడీలుగా కొనసాగిన భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలుగా నిర్వహిస్తున్నారు. వీటిలో చాలావరకు గ్రామీణ ప్రాంతాల్లోని రేకుల గదుల్లో కొనసాగుతుండటంతో వేసవి తాపానికి చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో 317 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వీటిలో 89 కేంద్రాలకే సొంత భవనాలున్నాయి. 163 కేంద్రాలను పలు ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల భవనాల్లో ఉచిత అద్దె కింద నిర్వహిస్తున్నారు. మిగతా 65 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నియోజకవర్గవ్యాప్తంగా గర్భిణులు 1,564 మంది, 1,335 మంది బాలింతలు ఉన్నారు. ఆయా కేంద్రాల్లో 6నెలల వయసు లోపు చిన్నారులు 1,280, ఏడాది వయసులోపున్న చిన్నారులు 1,326, మూడేళ్ల వయసున్న పిల్లలు 6,950, ఆరేళ్ల లోపు చిన్నారులు 5,032 మంది ఉన్నట్లు తెలుస్తోంది.


చిట్యాలలోని అంగన్‌వాడీ కేంద్రం

ఉక్కపోతలోనే...

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)
దేవరకొండ డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రాలు కొన్ని పక్కా భవనాల్లో, మరికొన్ని అద్దె భవనాలలో, రేకులషెడ్డులలో కొనసాగుతున్నాయి. రేకులషెడ్డులో ఎండవేడిమికి చిన్నారులు ఉక్కపోతకు గురై ఇబ్బందులుపడుతున్నారు. కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని ఆరు కేంద్రాలు అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. దేవరకొండ రోడ్డులోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో 14 మంది చిన్నారులతో రేకులషెడ్డులో కేంద్రం కొనసాగుతోంది. వేసవికాలం కావడంతో ఉక్కపోతతో చిన్నారులు ఇబ్బందిపడుతున్నారు. దేవరకొండ ఐసీడీఎస్ పరిధిలో 284 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 5,985 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు.


కొండమల్లేపల్లిలో రేకులషెడ్డు అద్దె భవనంలో కొనసాగుతున్న 2వ అంగన్‌వాడీ కేంద్రం

అసౌకర్యాల నడుమ


చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న అంగన్‌వాడీ టీచర్ భాగ్య

(ఆంధ్రజ్యోతి-భువనగిరిరూరల్): యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహిస్తున్నా మరికొన్ని నిర్వాహకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, చౌటుప్పల్, పోచంపల్లి మోత్కూరు మునిసిపాలిటీలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అందజేసే అద్దె నెలకు రూ.2 వేల నుంచి రూ.4 వేలు యజమానులు గిట్టుబాటు కాక అద్దెకు ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. దీనికితోడు 4 నెలల నుంచి 6నెలలకు ఒకసారి అద్దెచెల్లింపులు జరుగుతుండటంతో అద్దెకు ఇచ్చేందుకు ఇష్టపడటం లేదు. వెరసి దొరికిన ఇరుకు గదుల్లోనే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. ఈ విషయమై ఐసీడీఎస్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

నిబంధనల మేరకు అద్దె చెల్లింపు



ప్రభుత్వ నిబంధనల మేరకు మునిసిపాలిటీ పరిధిలో రూ.2 వేల నుంచి రూ.4వేల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1000 అద్దె చెల్లిస్తున్నాం. పట్టణాల్లో తక్కువ అద్దెకు ఇల్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. అయినప్పటికీ అర్బన్ ప్రాంతాల్లో అన్నివసతులతో కేంద్రాల నిర్వహణ చేపడుతున్నాం. వారంలో ఒకసారి తనిఖీలు చేపడుతున్నాం. పౌష్టికాహారం పంపిణీ, విధుల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీస్తున్నాం. పిల్లల తల్లిదండ్రులతో కూడా కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం.
- శైలజ , సీడీపీవో భువనగిరి ప్రాజెక్టు

యాదాద్రి జిల్లాలో ..

ఐసీడీఎస్ పరిధిలోని ప్రాజెక్టులు : భువనగిరి, రామన్నపేట, మోత్కూరు, ఆలేరు.
ఎన్ని కేంద్రాలు : 901
సొంత భవనాలు ఎన్ని : 269
అద్దె భవనాలు ఎన్ని : 328
రెంట్ ఫ్రీ భవనాలు:304 (కమ్యూనిటీ హాల్స్‌స్కూల్‌బిల్డింగ్స్ ఓల్డ్ జీపీ భవనాలు)
పట్టణ ప్రాంతాల్లో చెల్లిస్తున్న నెలసరి అద్దె : రూ.2 వేల నుంచి రూ.4వేలు
గ్రామీణ ప్రాంతాల్లో అద్దె : రూ.1000
ఆయా కేంద్రాల్లో 6నెలల్లోపు చిన్నారులు : 4,145
6 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు : 21,138
3నుంచి 6 ఏళ్లలోపు వారు : 12,181
గర్భిణులు : 3,742
బాలింతలు : 4,145

కిమ్స్‌లో గ్రహణం మొర్రికి ఉచిత శస్త్రచికిత్సలు



గ్రహణం మొర్రి ఉచిత శస్త్రచికిత్సల క్లాఫ్ కార్యక్రమ వివరాలు చెబుతున్న ప్రిన్సిపాల్ మహేశ్

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రహణం మొర్రికి తమ ఆసుపత్రిలో ఉచితంగా అత్యాధునిక శస్త్రచికిత్సలు చేయనున్నట్లు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని కామినేని దంత వైద్య, విద్య కళాశాల ప్రిన్సిపాల్ పీ.మహేశ్, మార్కెటింగ్ విభాగాధిపతి సత్యనారాయణ తెలిపారు. క్లాఫ్స్(క్లిఫ్ట్ లిప్ అండ్ పాలెట్ సర్జరీస్) పేరిట ఉచిత వైద్యంతో పాటు ఔషధాలు అందజేస్తామన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతీ 10వేల మంది జననాలలో ఇద్దరు లేదా ముగ్గురు గ్రహణం మొర్రి బారిన పడుతుంటే మన దేశంలో ప్రతీ 10వేల మంది జననాలలో 8 మంది గ్రహణం మొర్రి బాధితులున్నారని తెలిపారు. వవీరికి మూడు దశల్లో ఆపరేషన్లను చేయవచ్చని, కానీ ప్రాథమిక దశలోనే గుర్తించి శస్త్రచికిత్సలు చేయిస్తే ఆరోగ్యపరంగా మంచి ఫలితాలుంటాయన్నారు. మోతాదుకు మించి మద్యం సేవించడం, పొగత్రాగే తండ్రుల ద్వారా బీ ఫొలేట్ లోపంతో గ్రహణం మొర్రి రావటానికి అవకాశముంటుందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ సమస్యకు చికిత్స చేయించుకోవాలంటే గరిష్ఠంగా రూ.50,000లు అవుతాయని కానీ తమ ఆసుపత్రిలో నిష్ణులైన వైద్యులతో ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్ హెచ్‌వోడీ యశ్వంత్‌సాయి, పీఆర్‌వో కిరణ్ తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్ కోర్టు ఏజీపీగా రేణుకాదేవి


రేణుకాదేవి

హుజూర్‌నగర్ , ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని రెండవ అదనపు జిల్లా కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పట్టణానికి చెందిన శ్రీనివాసుల రేణుకాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రస్తుతం ఆమె సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా కొనసాగుతున్నారు. ఇక నుంచి రెండవ అదనపు జిల్లా కోర్టుకు కూడా ఏజీపీగా విధులు నిర్వహించనున్నారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకూ ఆమె విధులు నిర్వహించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె నియామకంపై న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, నారపరాజు శ్రీనివాసరావు, కాలువ శ్రీనివాసరావు, జక్కుల నాగేశ్వరరావు, నట్టె సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



నల్లగొండలో గురువారం ఉదయం లేతబంగారు వర్ణంలోని సూర్యుడితో పసుపువర్ణమైన ఆకాశం

హారికను ఆదుకుంటాం

● వైద్యసేవలు, ప్రభుత్వసాయంపై పరిశీలించండి
● ట్విట్టర్ వేదికగా అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో రెండేళ్ల కిందట పిచ్చికుక్కల దాడిలో గాయపడి అచేతనస్థితికి చేరిన బాలిక హారికను ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మంత్రి దామోదర రాజనర్సింహ ద్వారా బాలిక విషయం తెలుసుకున్న సీఎం గురువారం హారికకు వైద్యసేవలు అందించడంతో పాటు ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకోవాలని ట్విట్టర్(ఎక్స్) వేదికగా అధికారులను ఆదేశించారు. చిన్నారి తాత కొమ్ము రాందాసు, తల్లి సిద్వంతి తెలిపిన వివరాల ప్రకారం సిద్వంతి భర్త రెండున్నర ఏళ్ల కిందట మృతి చెందడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి సాగర్‌లో తల్లిగారింట్లోనే ఉంటోంది. రెండేళ్ల క్రితం చిన్నకుమార్తె హారిక(7) ఇంటి ముందు ఆటుకుంటుండగా పిచ్చికుక్కలు దాడిచేశాయి. రోడ్డుపై కొంతదూరం లాక్కెళ్లాయి. చిన్నారిని వెంటనే స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా రెండు డోసుల కుక్కకాటు ఇంజక్షన్లు వేశారు. మూడో డోసు వేసే సమయంలో తీవ్ర జ్వరంతో ఆ చిన్నారి బాధపడుతోంది. జ్వరం ఎంతకి తగ్గకపోవడంతో హారికను హైదరాబాద్ ఫీవర్ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగానే కాళ్లు, చేతులు స్పర్శను కోల్పోయాయి. దీంతో అక్కడి నుంచి నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా కోమాలోకి వెళ్లింది. 18 నెలల పాటు కోమాలో ఉన్న హారికను నల్లగొండ, హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో దాతల సహకారంతో వైద్యం చేయించారు. దీంతో కోమాలో నుంచి బయటకువచ్చింది. కానీ మాటలు రావడం లేదని తల్లి సిద్వంతి తెలిపింది. అమ్మా అని కూడా పిలవలేని స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో తన కుమార్తెను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వివిధ దినపత్రికల ద్వారా వేడుకుంది. పత్రికల కథనాల ద్వారా విషయం మంత్రి దామోదార రాజనర్సింహ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన స్పందించి చిన్నారికి మెరుగైన వైద్యం అందిచాలని నిమ్స్ డైరెక్టర్ బీరప్పను ఆదేశించారు. అంతే కాకుండా నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని సూచించారు. దీంతో బుధవారం మునిసిపల్ సిబ్బంది చిన్నారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై నివేదిక తయారుచేసి వైద్య, ఆరోగ్య శాఖకు పంపించారు. హారిక పరిస్థితిని మంత్రి సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన హారిక పరిస్థితిపై ఆరా తీశారు. అంతే కాకుండా బాలికకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాల్సిందిగా అధికారులను సీఎం గురువారం ట్విట్టర్ వేదికగా ఆదేశించారు.


చిన్నారి వివరాలను సేకరిస్తున్న ఆరోగ్య మిత్ర, ట్విట్టర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్



సీఎంకు రుణపడి ఉంటాం

మా పాపకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు, తమ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్‌లో తెలిపారు. ఇందుకు సీఎంకు రుణపడి ఉంటాం.
సిద్వంతి, చిన్నారి తల్లి

నేడు నిమ్స్‌కు తీసుకెళ్తాం

నేడు(శుక్రవారం) హారికను హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్తాం. మంత్రి రాజనర్సింహ ఆదేశాలతో హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నాం. ఇంటికి వచ్చిన ఆరోగ్యమిత్రకు చిన్నారికి ఆరోగ్యశ్రీ కార్డు కూడా లేదని తెలిపాం.
రాందాసు, హారిక తాత

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్యకైంకర్యాలు పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతకపఠనంతో హోమ పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.13,20,094 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహుడి క్షేత్రంలో గురువారం నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. కల్యాణం అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. అనంతరం దేవతమూర్తులను ఆలయ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, ఉద్యోగుల పాల్గొన్నారు.


ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

శిలువపై క్రీస్తు శాంతి సందేశం

నేడు గుడ్ ఫ్రైడే

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)
ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజును క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేగా నిర్వహిస్తారు. తిరిగి లేచిన మూడో రోజున ఈస్టర్ పండుగను జరుపుతారు. క్రైస్తవులకు ఇది అతి ముఖ్యమైన పండుగ. ఈ ఏడాది మార్చి 8వ తేదీ నుంచి మొదలుకుని ఈ నెల 18వ తేదీ వరకు 40 రోజుల పాటు క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేపట్టారు. గుడ్ ఫ్రైడే రోజు వరకు క్రైస్తవులు ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో ప్రతి రోజూ దైవ ప్రార్థనలు చేస్తారు. ఏసుక్రీస్తు జననం, మరణం, పునరుత్థానం ఘటనలు అసాధరణంగా వారు భావిస్తారు. ఏసుక్రీస్తు శిలువపై పడిన కష్టాలు, పలికిన ఏడు మాటలు ప్రపంచ మానవాళికి ప్రేమ మార్గాన్ని చూపుతాయని భక్తుల విశ్వాసం.

అందువల్ల ఆయన చనిపోయిన రోజును ప్రపంచవ్యాప్తంగా మంచి శుక్రవారం(గుడ్‌ఫ్రైడే)గా జరుపుకుంటారు. ఈ నెల 18వ తేదీన నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు జరగనున్నాయి. అందుకు చర్చీలు ముస్తాబయ్యాయి.



సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	515
టీఎంసీలు	140.3150
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1,350 క్యూసెక్కులు

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	34.10 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	500 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	4000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	627.30 అడుగులు
టీఎంసీలు	1.07
కాల్వలకు విడుదల	నిల్
ఇన్‌ఫ్లో	313.77 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	58.67 క్యూసెక్కులు

పులిచింతలలో జలవిద్యుత్

పునఃప్రారంభం



మేళ్లచెర్వు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఉభయరాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టులో గురువారం జలవిద్యుదుత్పత్తి ప్రారంభమైంది. ప్రాజెక్టు దిగువ భాగాన నీటి అవసరాల కోసం తెలంగాణ పవర్ హౌస్ నుంచి 4 వేల క్యూసెక్కులను వినియోగిస్తూ ఒక్క యూనిట్ ద్వారా 26 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 (45.77 క్యూసెక్కులు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 166.89 (34.10టీఎంసీలు) అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టుకు 500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి 4 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గేట్లు మూసివేసి ఉంచారు.

నిజాయితీ చాటుకున్న డ్రైవర్

వలిగొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుడు పోగొట్టుకున్న 25 తులాల బంగారం బ్యాగ్‌ను బాధితుడికి అప్పగించి ఓ ప్రైవేట్ డ్రైవర్, నిజాయితీని చాటుకున్నాడు యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన లాగ్గాని వెంకటేష్ గౌడ్ తుపాన్ వాహనం కిరాయి నడుపుతుంటాడు. ఈ క్రమంలో గురువారం ఇదే మండలం ఎదుళ్లగూడేనికి చెందిన మునికుంట్ల వెంకులు ఓ శుభకార్యం నిమిత్తం రంగారెడ్డి జిల్లా కీసరకు తుపాన్ వాహనం కిరాయి తీసుకొని బంధువులతో కలిసి వెళ్లి వచ్చాడు. అయితే వెంకులు వాహనంలో 25 తులాల బంగారు ఆభరణం, సెల్‌ఫోన్, గుర్తింపు కార్డులు కలిగిన బ్యాగు మరిచిపోయాడు. బ్యాగును గుర్తించిన డ్రైవర్ వెంకులుకు అప్పజెప్పి నిజాయితీని చాటుకున్నాడు.

మరో ఘటనలో మంగళసూత్రం అందజేసిన మహిళ



పుస్తెలతాడును లక్ష్మమ్మకు అందజేస్తున్న అనిత

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పరిధిలోని సుర్కంటిగూడేనికి చెందిన సుర్కంటి లక్ష్మమ్మ వెలిమినేడు శివారులోని కొనుగోలు కేంద్రంలో ఈనెల15న ధాన్యాన్ని ఆరబెట్టడానికి వెళ్లింది. ధాన్యం ఆరబెడుతున్న క్రమంలో మంగళసూత్రం పోగట్టుకుంది. అనంతరం మధ్యాహ్నం తన బావి వద్దకు వెళ్లి చూసుకోగా మెడలోని 4 తులాల మంగళసూత్రం కనబడక పోవడంతో బావి వద్ద, ఇల్లంతా వెతికింది. అయినా లభించలేదు. స్థానికంగా వాకబు చేసినా ఫలితం లేక పోయింది. అదే రోజు కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన మిర్యాల అనితకు మంగళసూత్రం దొరికింది. అక్కడ ఎవరూ కనబడకపోవడంతో ఇంటికి వచ్చింది. వ్యక్తిగత పనిమీద వేరే గ్రామానికి వెళ్లిన అనిత గురువారం గ్రామానికి వచ్చింది. విషయం తెలుసుకున్న అనిత గురువారం రాత్రి అనిత ఇంటికి వెళ్లిన లక్ష్మమ్మకు మంగళసూత్రాన్ని అందజేసింది. దీంతో లక్ష్మమ్మ అనితకు కృతజ్ఞతలు తెలిపింది.

రైస్‌మిల్‌లో విజిలెన్స్ బృందం తనిఖీ

చింతపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని నసర్లపల్లిలోని వెంకటసాయి రైస్‌మిల్‌లో హైదరాబాద్‌కు చెందిన విజిలెన్స్ బృందం గురువారం తనిఖీ చేసింది. పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించింది. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుతో పాటు నిల్వల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తీసు కుంటా మన్నారు. వ్యాపారులు మోసానికి పాల్పడితే కేసు నమోదు చేస్తామని హెచ్చ రిం చారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రికార్డుల్లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మఠంపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లబోతుల కోటయ్య(56)ఈనెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మూడు రోజులు గడుస్తున్నా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మఠంపల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించగా, మరో ఇద్దరు ఆత్మహత్య చేసుకోగా యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే..

కేతేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి 65వ నంబరు జాతీయ రహదారిని రోడ్డు దాటుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. కేతేపల్లి ఎస్ఐ ఎ.శివ తేజగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు గ్రామానికి చెందిన బందనాథం అరుణ పుట్టిల్లు కేతేపల్లి మండలం ఇనుపాముల ఆవాస గ్రామం రాయపురం. కేతేపల్లిలోని ప్రభుత్వ కార్యాలయంలో పని నిమిత్తం ఇక్కడకు వచ్చిన అరుణ స్థానిక ఎస్సీ కాలనీ వద్ద ఆటో దిగి అక్కడ గల జంక్షన్‌లో హైవేను దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో అరుణ తలకు, కడుపులో బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108సిబ్బంది ఆమెను సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అరుణ మరణించినట్లు ఎస్ఐ వివరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మిర్యాలగూడలో వృద్ధుడు..

మిర్యాలగూడ అర్బన్ : నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బంగారు గడ్డకాలనీకి చెందిన గుంటి ఆదినారాయణ(65) స్కూటీపై రోడ్డుపై వెళ్తుండగా ఓ ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆదినారాయణ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి మేనల్లుడు చిలుకూరి బాలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు వన్‌టౌన్ సీఐ మోతీరాం తెలిపారు.

కాగా మృతుడు ఆదినారాయణ నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించడంతో డైమండ్ నేత్రనిధి ప్రతినిధులు ఆదినారాయణ నేత్రాలను సేకరించారు. దీంతో మరో ఇద్దరు అంధులకు కంటిచూపునిచ్చేందుకు ఆదినారాయణ నేత్రాలు ఉపకరిస్తాయని నేత్రనిధి ప్రతినిధులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

సంస్థాన్ నారాయణపురం : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన కొల్లూరి పవన్ కుమార్ (19) ప్లంబర్. కుర్మకొత్తగూడెం గ్రామంలో ఓ ఇంటికి ప్లంబర్ పని చేయడానికి మరో వ్యక్తితో కలిసి గురువారం వెళ్లాడు. వాటర్ పైప్ వేయడానికి డ్రిల్లింగ్ మిషన్‌తో గోడకు డ్రిల్ చేస్తుండగా విద్యుత్ బోర్డుకు డ్రిల్లింగ్ మిషన్‌కు ఉన్న ప్లగ్ ఊడి కిందపడింది. అప్పటికే ఇంటి గోడలకు నీళ్లు కొట్టడంతో కింద నీళ్లు నిలిచాయి. ఊడిన ప్లగ్ అందులో పడడంతో పవన్‌కుమార్‌కు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సింహ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పవన్‌కుమార్(ఫైల్)

నిప్పంటించుకుని బాలిక ..

బీబీనగర్ : మానసిక స్థితి బాగా లేని ఓ మైనర్ ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యాదాద్రి భువ నగిరి జిల్లా బీబీనగర్ మండలం రుద్రవెల్లి గ్రామంలో గురువారం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... రుద్రవెల్లి గ్రామానికి చెందిన దండ్రు నర్సింహ నిర్మల దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వీరిలో చిన్న కూతురు దండ్రు దీపిక (17) కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో అప్పుడప్పుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడేది. కుటుంబ సభ్యుల జాగ్రత్తతో ప్రాణా పాయంతో బయటపడేది. అయితే గురువారం ఉదయం దీపిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో బండిలో నుంచి పెట్రోల్ తీసి నిప్పంటించుకుంది. దీంతో తీవ్ర కాలిన గాయాలతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

మానసిక వేదనతో ప్రభుత్వ ఉద్యోగి ..



తిరుమలగిరి(సాగర్) : తన తల్లి మృతిచెందడంతో కొద్దికాలంగా మానసిక వేదనకు గురై ప్రభుత్వ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్)మండలం కొంపెల్లి గ్రామంలో బుధవారం ఘటన జరుగగా గురువారం వెలుగులోకి వచ్చింది. కొంపెల్లి గ్రామానికి చెందిన చిత్రం కొండల్(35)యాదాద్రి భువనగిరిజిల్లా కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 9 నెలల క్రితం కొండల్ తల్లి ఈదమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి కొండల్ మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడు. నాలుగు రోజుల క్రితం సెలవుపై ఇంటికి వచ్చిన కొండల్ ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం ఉదయం తండ్రి చినమల్లయ్య గేదెలను మేపడానికి పొలానికి వెళ్లాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. స్థానికుల సాయంతో కిందకు దింపి చూడగా పురుగుల మందు తాగి అనంతరం ఉరేసుకున్నట్లుగా గుర్తించారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు.

ఇసుక డంప్‌ల సీజ్



ఇసుక డంప్‌ను సీజ్ చేసిన అధికారులు

రాజాపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను గురువారం తహసీల్దార్ అనిత సీజ్ చేశారు. సుమారు 240 ట్రిప్పుల ఇసుకను అనుమతులు లేకుండా నిల్వ చేశారని వారు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకోసం ఇసుక అనుమతి తీసుకొని పక్కాదారి పట్టించారని పేర్కొన్నారు.

పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మునగాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మునుగాల మండల కేంద్రం శివారులో పొలంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తూముల వీరస్వామి పొలాన్ని కోత మిషన్‌తో కోపిస్తుండగా దుర్వాసన వచ్చింది. దీంతో పరిసర ప్రాంతాలను పరిశీలించగా బురదలో ఓ వ్యక్తి మృత దేహం కనిపించింది. వెంటనే వీరస్వామి స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన పోలీస్ సిబ్బందితో పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. సుమారు 40 ఏళ్లలోపు వయస్సు గల వ్యక్తిగా గుర్తించారు. బ్లూ కలర్ జీన్ పాయింట్, టీషర్ట్‌తో మృతదేహం కుళ్లిపోయివాసన వస్తున్నది. ఐదురోజుల క్రితం వచ్చిన గాలి వానకు పొలంలో ఎల్‌టీ లైన్ విద్యుత్ వైర్లు తెగిపడి విద్యుదాఘాతంతో మృతి చెంది ఉండ వచ్చని అని భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ లభించలేదు. కుళ్లిన మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రి మార్చురీ గదిలో ఉంచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వెంటనే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆక్రమణల కూల్చివేతకు కలెక్టర్ ఆదేశాలు



సర్వే చేస్తున్న తహసీల్దార్, సర్వేయర్

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల కూల్చివేతకు రెవెన్యూ అధికారులు సత్వర చర్యలకు ఉపక్రమించారు. ఆక్రమణల ఫిర్యాదులు వచ్చిన నిర్మాణాలు జరిగిన స్థలంలో గురువారం సర్వే చేసి డీ మార్కేషన్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి గ్రామ పంచాయ తీ పరిధిలో సర్వే నంబర్ 550లో సుమారు 106 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. వీటిలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణం మేర పలు దఫాలుగా ప్రభుత్వం అసైన్డ్ కమిటీ నిర్ణయం మేరకు లబ్ధిదారులకు పట్టా లు పంపిణీ చేసింది. అయితే ఇదే సర్వే నంబర్‌లోని ప్రభుత్వం అసైన్డ్ చేయగా మిగిలిన కొంత భూమితో పాటు రామిడి గోపాల్ అనే ఓ పట్టాదారుడికి అసైన్డ్ చేసిన 15 గుంటల భూమిలో ఓ విత్తన కంపెనీ యాజమాన్యం భవనాలను నిర్మించింది. దీంతో రామిడి గోపాల్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించి విచారణకు కలెక్టర్ ఆదేశించగా ఇప్పటికే పలు దఫాలుగా జిల్లా సర్వే అధికారి (డీఐ), ఆర్‌డీవో, మండల రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు అందజేయగా బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇలా త్రిపాఠి విచారణ నిర్వహించారు. ఫిర్యాదు ఎదుర్కొంటున్న నిర్మాణాలు గల భూమి ప్రభుత్వ భూమి కాదని కంపెనీ యాజమాన్యం నిరూపించలేకపోయింది. పైగా వసర్వేయర్ నివేదిక కూడా షెడ్డు నిర్మాణంలో సుమారు 15 నుంచి 19 గుంటల వరకు ప్రభుత్వ భూమి ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించే సర్వే నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో ఆక్రమణలను 48 గంటల్లో కూల్చివేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, సర్వేయర్ బీ.శ్రీనివాస్, ఆర్ఐ భవానీ గురువారం సంబంధిత కంపెనీ షెడ్డు నిర్మాణ స్థలాన్ని సర్వే చేసి ప్రభుత్వ భూమి ఉన్నంత వరకు డీ మార్కేషన్ చేశారు. ఆక్రమిత ప్రభుత్వ స్థలాన్ని 48 గంటల్లో ఖాళీ చేయాలని కంపెనీ యజమానికి నోటీసులు సిద్ధచేస్తున్నారు.

కాల్వల భూపరిహారం
నిధులూ మింగేశారు

● ఫోర్జరీ సంతకాలతో నిధులు కాజేసిన అధికారులు



ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటరీ 8,9కి అనుసంధానంగా నిర్మించిన 15 ఆర్ మైనర్ కాల్వ

ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణంలో భూనిర్వాసితులకు మంజూరైన నిధులను కొందరు అధికారులు కాజేశారు. సుంకిశాల- కోదండాపూర్ భూనిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని ఫోర్జరీ సంతకాలతో దోచినట్లుగానే ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 9, డిస్ట్రిబ్యూటరీ కాల్వ 8,9కి అనుసంధానంగా నిర్మించిన 15ఆర్ మైనర్ల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు దక్కాల్సిన నిధులను స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెండు ప్రాజెక్టులకు సంబంధించి భూనిర్వాసితుల పరిహారాన్ని ఫోర్జరీ సంతకాలతో కాజేసిన వ్యవహారంలో ఓ రెవెన్యూ అధికారి కీలకపాత్ర వహించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎమ్మార్పీ) ప్రధాన కాల్వ 9కి అనుసంధానంగా మైనర్ కాల్వలను నిర్మించడానికి 2007 అక్టోబరులో ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. డిస్ట్రిబ్యూటరీ 8,9 లకు పర్వేదుల వద్ద నుంచి నాటి చలకుర్తి గ్రామపంచాయతీ మల్లోరికుంట తండా వరకు సుమారు 2 కి.మీ మేర 15 ఆర్ మైనర్ కాల్వ ఏర్పాటు చేసేందుకు 44 మంది రైతుల నుంచి భూమిని సేకరించింది. ఇం దుకు ఎకరానికి రూ.80 వేల చొప్పున పరిహారం ప్రకటించింది. భూనిర్వాసితులకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పేరున ఏఎమ్మార్పీ యూనిట్ 11 నల్లగొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) చెక్కులను జారీ చేశారు. అయితే సంఘమిత్ర కో-ఆపరేటివ్ బ్యాంకు నల్లగొండలో లబ్ధిదారుల ఖాతాలు తెరిపించి ఏజెంట్ అవతారం ఎత్తిన అధికారి నిధులు డ్రాచేసి తన కమీషన్ కట్ చేసుకుని కొందరికీ పరిహారం అందజేయగా మరికొందరి లబ్ధిదారులకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో లక్షలు కాజేసినట్లు సమాచారం.

ఆయనే కీలకం

భూపరిహారాన్ని నిర్వాసితులకు అందకుండా కాజేసినవారిలో ఓ పంచాయతీ అధికారే కీలకమని బాధితులు ఆరోపిస్తున్నారు. పర్వేదుల గ్రా మానికి చెందిన అధికారి అనారోగ్యానికి గురై విధులు నిర్వహించలేని స్థితిలో ఆయన కుమారుడు అనాధికారికంగా అన్నిసర్టిఫికెట్లపై, రిజిష్టర్లలో తండ్రి సంతకాలు తానే ఫోర్జరీ చేస్తూ అక్రమాలకు తెర లేపినట్లు బాధితులు వాపోతున్నారు. అనతికాలంలో తండ్రి ఉద్యోగంలో నియమాకమై పదోన్నతి పొంది ప్రస్తుతం సొంత మండలంలోనే రెవెన్యూ శాఖలో అధికారిగా విధులు నిర్వహిస్తుండగా, చిన్న ఉద్యోగం తోనే కోట్లలో ఆస్తులను కూడబెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఫోర్జరీ సంతకాలతో నిధులు కాజేశారు

నా భూమి 2 ఎకరాలు, మా సోదరుడి కుమారుడిది ఎకరం 10 గుంటలు మైనర్‌కాల్వ నిర్మాణంలో పోతుండడంతో ప్రభుత్వం పరిహారం కింద రూ.3.05 లక్షల పరిహారం ప్రకటించింది. మా కుటుంబం ఊర్లో లేని కాలంలో మా సంతకాలను ఫోర్జరీ చేసి పంచాయతీ అధికారి కాజేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాను.

\- మేరెడ్డి జైపాల్‌రెడ్డి, పెద్దవూర

కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం

పరిహారం నిధులు కాజేసిన విషయమై బాధితుల నుంచి ఫిర్యాదు అందింది. పెద్దవూర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ సాగిస్తున్నాం.

\- శ్రీనునాయక్, సీఐ, నాగార్జునసాగర్

ఆరుగురు లబ్ధిదారులకు అందని పరిహారం

తమకు పరిహారం అందలేదని సంబంధిత భూనిర్వాసితులు నల్లగొండ సంఘమిత్ర సహకార బ్యాంకులో తమకు జారీ చేసినట్లు చెబుతున్న చెక్కుల గురించి వివరాలు అడిగితే బ్యాంకు అధికారులు ఏ సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. పర్వేదులకు చెం దిన మేరెడ్డి జైపాల్‌రెడ్డి(2 ఎకరాలు) అతడి సోదరుడి కుమారుడు సాయిశరత్‌రెడ్డి(ఎకరం) స్థానికంగా లేనప్పటికీ అన్ని రికార్డుల్లో వారి సంతకాలను ఫోర్జరీ చేసి వారి పేరున 80, 91, 92, 93 గల 3 ఎకరాల10 గుంటల భూమి, అందులోని 127 బత్తాయి చెట్లుకు జైపాల్‌రెడ్డి ఒక్కరి పేరున రూ. 3,05,221 మంజూరు చేసినట్లు చూపి ఫోర్జరీ సంతకాలతో కాజేసినట్లు ఆరోపించారు. మరో 5గురికి లక్షల్లో అందాల్సిన పరిహారాన్ని మింగేసినట్లు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకు అధికారులను చెక్కుల డ్రా కు సంబంధించి సంబం ధిత లబ్ధిదారులు వివరాలు అడిగితే బ్యాంకు అధికారులు సాకులు చెబుతూ దాటవేస్తున్నారని అంటున్నారు.

బిర్యానీలో ఈగ.. రూ.5 వేల జరిమానా



జరిమానా విధిస్తున్న మునిసిపల్ అధికారులు

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హోటల్ యాజమాన్యాలు ప్రజల ఆరోగ్యాలతో చెలగాట మాడితే కఠిన చర్యలు తీసుకుంటా మని మునిసిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని దురాజ్‌పల్లి వద్ద గల హంగ్రీ బర్డ్స్ బిర్యానీ సెంటర్‌లో బిర్యానిలో ఈగ వచ్చినట్లు కస్టమర్ ఫిర్యాదు చేశారు. దీంతో తనిఖీలు నిర్వహించి యాజమాన్యానికి రూ. 5000 జరిమానా విధించారు. హోటల్ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ సీహెచ్. శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఓ మాట .. మహోద్యమానికి బాట



భూదాన్‌పోచంపల్లిలోని ఆచార్య వినోబాభావే వెదిరె రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలు

'దేశంలో భూమి కోసం ఎన్నో యుద్ధాలే జరిగిన సంఘటనలు ఉన్నాయి. కానీ, ఓ స్ఫూర్తివంతమైన వ్యక్తి చెప్పిన మాట మహోద్యమానికి దారి తీసింది. భూదానోద్యమానికి వెదిరె రామచంద్రారెడ్డి ముందడుగు వేస్తే.. ఈ నడక పలువురికి మేలు చేసేలా చేసింది. ఆచార్య వినోబా భావే. 1951 ఏప్రిల్ 18న దేశ చరిత్రలోనే భూమిని దాన రూపంగా ఇచ్చి భూదానోద్యమానికి నాంది పలి కిన పోచంపల్లి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రాంతంగా చోటు చేసుకుంది. నేడు భూదానోద్యమ జయంతి వజ్రో త్సవాల సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : గాంధీజీ ఆశయాలు, సర్వోదయ సిద్ధాంతాలను ప్రచారం కోసం ఆచార్య వినోబా భావే పౌనార్ ఆశ్రమాన్ని వీడి దేశమంతటా పాదయాత్ర చేయడానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో సర్వోదయ నాయకుడు శ్రీ రామకృష్ణ దూత్ ఆహ్వానం మేరకు 1951 ఏప్రిల్ 15న హైదరాబాద్ సమీపంలో గల శివరాంపల్లిలో నిర్వహించే సర్వోదయ సమ్మేళనంలో తన సందేశాన్ని ఇవ్వడానికి వచ్చారు. అదే సమయంలో తెలంగాణ సాయుధ పోరాటం సాగుతున్న తరుణంలో నల్ల గొండ జిల్లాలజరుగుతున్న రజాకార్ల దోపిడీ, కల్లోల పరిస్థితులు తెలుసుకుని వెంటనే పాదయాత్రగా బయలుదేరి 17న ప్రస్తుత యాదాద్రి-భువనగిరి జిల్లాలోని పోచంపల్లికి వినోబాభావే చేరుకున్నారు. మరుసటి రోజు ఏప్రిల్ 18న హరిజనులతో ఆయన సమావేశమయ్యారు. దీంతో వారు తమ గోడును వెళ్ల బోసుకున్నారు. వినోబాభావే అందుకు స్పందిస్తూ.. మీలో ఎవరైనా భూమిని దానం చేసేవారున్నారా? అని ప్రశ్నించారు. అక్కడ జన సందోహం మధ్యలో ఉన్న వెదిరె రామచంద్రారెడ్డి లేచి తన తండ్రి జ్ఞాపకార్థం 100 ఎకరాల సేద్యయోగ్యమైన భూమిని దానం చేస్తానని

● భూదానోద్యమానికి నాంది పలికిన పోచంపల్లి

ప్రకటించారు. అక్కడికక్కడే దాన పత్రాన్ని రాసి వినోబాభావేకు అందజేశారు. అలా లభించిన ఆ భూమిని వినోబాభావే పేదలకు పంచి భూదానోద్యమానికి బీజం వేశారు. వినోబాభావే పోచంపల్లికి వచ్చే వరకు భూదానోద్యమంపై ఆలోచన రాలేదు. యాదృచ్ఛికంగా భూదానోద్యమం ఒక స్పష్టమైన కార్యక్రమంగా రూపుదిద్దు కుంది. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా దాదాపు 80వేల కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి 1970 వరకు దాదాపు 44 లక్షల ఎకరాల భూమిని భూదానోద్యమంలో సేకరించారు. సుమారు 40లక్షల మందికి దానం చేశారు.

పోచంపల్లిలో మూడు సార్లు పర్యటన


ఆచార్య వినోబాభావే పోచంపల్లిలో మొత్తం మూడు సార్లు పర్యటించి తన పాదయాత్ర ద్వారా 1.70 లక్షల ఎకరాల భూమిని సేకరించారు. అలాగే రెండోసారి ఉమ్మడి రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి 1955 డిసెంబర్‌లో పాదయాత్ర ప్రారంభించి 1956లో గాంధీ వర్ధంతి రోజున జనవరి 30న పోచంపల్లికి చేరుకున్నారు. సేకరించిన 1.70 లక్షల ఎకరాల్లో 1.26 లక్షల ఎకరాల భూమికి మాత్రమే చట్టబద్ధత కలిగి ఉంది. జిల్లాలో సైతం వేల ఎకరాల భూమిని భూమిలేని నిరుపేదలకు పంచిపెట్టారు. ఇలా భూదానోద్యమానికి అంకురార్పణ జరిగిన పోచంపల్లిని 'భూదాన గంగోత్రి'గా అభివర్ణిస్తూ ఆయన తన రెండో జన్మస్థలంగా పోచంపల్లిని పేర్కొన్నారు

నేడు భూదాన్ జయంతి వజ్రోత్సవాలు



భూదాన్ జయంతి వజ్రోత్సవాలు శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలో వినోబామందిరంలో ఘనంగా నిర్వహిస్తాం డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు డా.గున్న రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన శాంతిహోమం, 'భూభారతి-భూదాన్ భూముల సమస్యలకు పరిష్కారం' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తాం. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు.

\- యానాల ప్రభాకర్‌రెడ్డి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



వినోబాభావేకు దానపత్రం అందిస్తున్న వెదిరె రామచంద్రారెడ్డి (ఫైల్)

ప్రారంభానికి నోచుకోని వినోబా మందిరం

భూదానోద్యమానికి నాంది పలికిన భూదాన్‌పోచంపల్లిలో స్మృతి చిహ్నంగా నిర్మించిన వినోబామందిరం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. శిథిలమైనందున దశాబ్దకాలం క్రితం రూ.50లక్షలతో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో భూదాన్‌పోచంపల్లి పట్టణంలో వినోబామందిరాన్ని పునర్నిర్మించారు. ఈ మందిరం నిర్వహణ కానీ, దాని ఆలనాపాలనా లేక ఎప్పుడూ తాళం వేసే కనిపిస్తోంది. అయితే వినోబామందిరం నిర్వహణ బాధ్యత రాష్ట్ర భూదాన్‌యజ్ఞ బోర్డు చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. తన సొంత నిధులతో ఈ భవనంలో గాంధీజీ, వినోబాభావేలకు సంబంధించిన సాహిత్యాన్ని, భూదానోద్యమ చారిత్రక ఘట్టాలను చాటే మ్యూజియం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం వినోబా మందిరం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని భూదాన్‌పోచంపల్లిలోని వినోబామందిరం

మిస్ వరల్డ్ అందాల పోటీలను వ్యతిరేకించాలి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ అందాల పోటీలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, ఐద్వా జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేటలో తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ పోటీలను నిలిపివేయాలని కలెక్టరేట్ ఎదుట ఈనెల 19న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో హేమలత, మారసాని చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఎంఈవో నకిరేకంటి రవి అన్నారు. గురువారం మండలంలోని అనాజిపురం మోడల్ స్కూల్లో కంప్యూటర్ సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోడి లింగయ్య, మండల నోడల్ అధికారి వాస్త్రంనాయక్, అన్నామేరీ, వైస్ ప్రిన్సిపల్ కె.గురుచరణ్ పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోదాడ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి, రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ లైన్‌ను మార్చడానికి మండలంలోని రెడ్లకుంట గ్రామంలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ సైదా తెలిపారు. విద్యుత్‌వినియోగదారులు, సహకరించాలని ఆయన కోరారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా మారుడి శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జెట్టి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా షేక్ హుస్సేన్, విద్యాచారి, సహాయ కార్యదర్శిగా యడవెల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా రాఘవరెడ్డిని, అదేవిధంగా 23 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

సుర్రుమంటున్న సూర్యుడు

● నిప్పుల కొలిమిలా ఎండలు ● తల్లడిల్లుతున్న చిన్నారులు, వృద్ధులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూర్యుడు సుర్రు మంటున్నాడు. రోజురోజుకి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటలు దాటిందంటే వాతావరణం నిప్పుల కొలిమిలా మారుతోంది. రాత్రి ఏడు గంటలు దాటినా వడ గాలి తగ్గడం లేదు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు.

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఎండలకు చిన్న పిల్లలు, వృద్ధులు తల్లడిల్లుతున్నారు. జిల్లాలో ఈ నెల 14వ తేదీన 40 డిగ్రీలు 15వ తేదీన 39డిగ్రీలు, 16వతేదీ 41డిగ్రీలు, 17వ తేదీన 41 డిగ్రీలు నమోదైంది. ఎండలతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రానందున వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నారు. నీటి కోసం పక్షులు అల్లాడుతున్నాయి. ప్రజలు శీతల పానీయాలు, కొబ్బరిబొండాలు, నిమ్మ రసాలు, జ్యూస్‌లు తాగి ఉపశమనం పొందుతున్నారు.

గత ఏడాది కంటే ఎక్కువగా ఎండలు

గత ఏడాది కంటే ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నాయి. గత ఏప్రిల్ మొదటి వారంలో 38 డిగ్రీల వరకు ఎండలు నమోదు కాగా, ఈ ఏడాదిఈ నెల మొదటి వారంలో 40 డిగ్రీలకు పైగా ఎండలు నమోద య్యాయి. రానున్న రోజుల్లో ఎండలు ఇంకా మండుతాయని ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా ఎండ వేడిమికి చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు.

గిర్రున తిరుగుతున్న మీటర్లు

ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఇంట్లో ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. ఈ నెలలో చెల్లించిన విద్యుత్ చార్జీల కంటే వచ్చే నెలలో డబుల్ విద్యుత్ చార్జీలు చెల్లించాల్సి వచ్చే అవకాశం ఉందని ప్రజలు భయపడుతుఆన్నారు.



జిల్లా కేంద్రంలో మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

నిమ్మకాయ సోడాలకు గిరాకీ పెరిగింది



ఎండలు ఎక్కువగా ఉన్నందున నిమ్మకాయ సోడాలు తాగేందుకు ప్రజలు వస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే వారు ఉదయం 10 గంటల నుంచే నిమ్మకాయ సోడాలను తాగుతున్నారు. గతంలో కన్నా కాస్త ఎండలు పెరిగాయి.

● రేణుక, నిమ్మకాయ సోడా దుకాణం నిర్వాహకురాలు

రక్షణ చర్యలు తీసుకోవాలి



ప్రజలు ఇంటి నుండి బయటికి వస్తే ఎండ నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి. టోపీ, రుమాలు, చల్లని కళ్లద్దాలు ధరించాలి. అవసరమైతే మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావొద్దు. ఎండ దెబ్బకు గురైతే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం.

● కోటాచలం, డీఎంహెచ్‌వో

సకాలంలో పన్నులు చెల్లించాలి

సంతోష్‌కుమార్, సూర్యాపేట మార్కెట్ కమిటీ కార్యదర్శి



ఇంటర్వ్యూ Interview

సూర్యాపేట మార్కెట్‌లో సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని, రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సంతోష్‌కుమార్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

● భానుపురి, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి: సూర్యాపేట మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధర ఎందుకు రావడం లేదు.?

కార్యదర్శి: రైతులు ధాన్యం నాణ్యత ప్రమాణాలతో తీసుకురానందున గిట్టుబాటు ధర రావడం లేదు. రైతులు నేరుగా కోతమిషన్లతో పంటను కోయించి ఎండబెట్టకుండా తీసుకువస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: కమీషన్‌దారులే తక్‌పట్టీలో రైతుల పేర్లు, గ్రామాల పేర్లు ఎందుకు రాయడంలేదు.

కార్యదర్శి: తక్‌పట్టీల్లో గ్రామాల పేర్లను తప్పకుండా రాయాలి. గ్రామ పేర్లు రాయడం లేదని ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు.

ఆంధ్రజ్యోతి: ల్యాబ్‌కు పంపడానికి రైతుల ధాన్యం రాశుల నుంచి కిలో చొప్పున తీసుకుంటారు. పరీక్ష తర్వాత ఆ ధాన్యం ఏమవుతోంది.?

కార్యదర్శి: ల్యాబ్‌లో ధాన్యం పరీక్ష పూర్తయిన తర్వాత ఏవరి ధాన్యం వారికి పంపిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఈనామ్ పద్ధతిలో మార్కెట్ నడవడం లేదని రైతులు అంటున్నారు. ఏమి జరుగుతోంది.

అధికారి: 99 శాతం ఈనామ్ పద్ధతిలోనే మార్కెట్‌ను నడుపుతున్నాం. ఆన్‌లైన్‌లోనే బిడ్డింగ్ వేసి ధరలను కూడా నిర్ణయిస్తున్నారు. ఎక్కడా అవకతవకలు లేవు.

ఆంధ్రజ్యోతి: మామిడి మార్కెట్లపై పర్యవేక్షణ ఏవరిది.?

అధికారి: చెక్‌పోస్టుల ద్వారా మార్కెట్ ఫీజు వసూళ్లు చేస్తున్నాం. మా సిబ్బంది మామిడి మార్కెట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మామిడి మార్కెట్లలో వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నారు. మీరు ఏమి చర్యలు తీసుకుంటున్నారు.

కార్యదర్శి: మామిడి మార్కెట్లలో ధరలపై మా సిబ్బంది ఏమీ అడ మార్కెట్ ఫీజు మాత్రమే వసూలు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: మార్కెట్‌లో హమాలీల కొరతపై చర్యలు ఏమిటీ? .

కార్యదర్శి: రైస్ మిల్లులు కలిగిన ఖరీదుదారులు లారీల వెంటనే హమాలీలను తీసుకువస్తున్నారు. కొంత మందికి హమాలీల కొరత ఉంది. బీహార్ నుంచి హమాలీలను తీసుకువచ్చారు.

ఆంధ్రజ్యోతి: పశువుల సంతలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారు.?

కార్యదర్శి: పరిశీలలించి చర్యలు తీసుకుంటా.

ఆంధ్రజ్యోతి: మార్కెట్‌లో 100కు రెండున్నర కమిషన్ తీసుకుంటున్నారు ఎందుకని?

అధికారి:ట మార్కెట్‌లో రెండు రూపాయలు కమీషన్ తీసుకోవాలనే నిబంధన ఉంది. రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఇల్లాలి చదువు ప్రగతికి వెలుగు



చట్టాలపై అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీవాణి

ఆత్మకూర్(ఎస్), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇల్లాలి చదువు ప్రగతికి వెలుగని జిల్లా సివిల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ శ్రీవాణి అన్నారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ అభినా చారిటబుల్ ట్రస్ట్, మండల మహిళ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ సలహా సదస్సులో ఆమె మాట్లాడారు. రాజ్యాంగంలో మహిళలకు పురుషులకు విద్యా అవకాశాలు సమానంగా అంబేడ్కర్ కల్పించారన్నారు. చట్టాల గురించి, న్యాయ వ్యవస్థ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికిశోర్‌వర్మ, ఎంపీడీవో హసీం, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపెల్లి లింగయ్యయాదవ్, విష్ణుస్వరూప్, రాజుయాదవ్, వెంకటరత్నం, సురేష్, గోపి, రత్తయ్య, మంజుల, లలిత, జ్యోతి, వాణి, కీత పద్మజ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

హుజూర్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఫలితాల్లో పట్టణంలోని గోవిందాపురంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఎంపీపీఎస్‌కు చెందిన దార్ల గణదీప్, దాసరి నిఖిల్, దగ్గుపాటి హనీ, బొల్లెద్దు అభిజ్ఞ, లింగాల రిషిక, ఉండేటి నవ్యతేజస్విని విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పాఠశాలలో మొత్తం 45 మంది విద్యార్థులుఉండగా, వారిలో ఆరుగురు గురుకులానికి ఎంపిక య్యారు. 4వ తరగతిలో 14 మంది విద్యార్థులు ఉండగా వారిలో ఆరుగురు గురుకుల పరీక్ష రాయగా, అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గొట్టె శ్రీనివాస్, ఉపాధ్యాయులను మాజీ కౌన్సిలర్లు బొల్లెద్దు ధనమ్మ, చిలకబత్తిని సౌజన్య, సీఐ సురేష్, ఎస్ఐ ధనుంజయ్ తదితరులు అభినందించారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

కోదాడ రూరల్, చిలుకూరు, తుంగతుర్తి, నూతనకల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయా లని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. గురువారం గుడిబండ గ్రామంలో మాజీ ఎంపీపీ చింత కవితా రాధారెడ్డి అధ్యక్షతన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కోసం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శెట్టి సురేష్ నాయుడు, రమేష్, బ్రహ్మంగౌడ్ పాల్గొన్నారు.

● వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అల్సకాని జనార్దన్, గ్రామశాఖ కార్యదర్శి అల్లి ఉపేందర్ కోరారు. సభ పోస్టర్‌ను గురువారం చిలుకురులోని బస్టాండ్ సెంటరులో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో షేక్ పాషా, కాశయ్య పాల్గొన్నారు.

● వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ తుంగతుర్తి మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. గురువారం వెంపటి గ్రామంలోని నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాములుగౌడ్, సాయిలు, భిక్షం, సతీష్‌పాల్గొన్నారు.

● వరంగల్‌లో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నూతనకల్ మండల నాయకుడు మండడి సోమిరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు మొగుళ్ల వెంకన్న, వీర్‌యాదవ్, మల్లయ్య, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గోన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

అనంతగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలంలోని త్రిపురవరం గ్రామానికి చెందిన సుంకర వెంకటేశ్వర్లు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనతో పాటు ప్రభుత్వ పాఠశాల 1993-94బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు వెంకటేశ్వర్లు సతీమణి సౌజన్యకు గురువారం రూ.23వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ ఏడుకొండలు, రాఘవరెడ్డి, వీరయ్య, మౌలాలి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో చెత్త వేయొద్దు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):మురుగు కాల్వల్లో చెత్త, ప్లాస్టిక్ వస్తువులను వేయరాదని మునిసిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మురుగు కాల్వలో పూడిక తొలగించే పనులను గురువారం ప్రాంభించి మాట్లాడారు. ఈ పనులకు రూ.25లక్షలు కేటాయించినట్లు తెలిపారు.ఈ. కార్యక్రమంలో మునిసిపల్ డీఈ. సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● మునిసిపల్ సిబ్బంది గురువారం పట్టణంలో తనిఖీలు చేసి నల్లాలకే నేరుగా మోటర్లు అమర్చిన ఏడు మోటార్లను సీజ్ చేసి రూ.5వేల జరిమానా విధించినట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

తిరుమలగిరి, భానుపురి ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో వేణుమాధవరావుతో కలిసి నియోజకవర్గ స్థాయిలో తహసీల్దార్, కమిషనర్, కమిషనర్, ఎంపీడీవోలతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 3500ఇళ్లు మంజూరు చేశారని, మొదటగా పైలెట్ ప్రాజెక్ట్ కింద మండ లంలో, ఒక గ్రామాన్ని ఎంపిక చేశామని, ఆ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టంతో రైతులకు మేలు కలుగుతుందన్నారు. తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో బిక్కేరు వాగుపై వంతెన పనులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 22 శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవరావు, వివిధ మండలాల తహసీల్దార్లు, కమిషనర్లు, ఎంపిఓలు, తిరుమలగిరి నాయకులు వై నేరేష్, జనార్దన్, జుమ్మిలాల్, తదితరులు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలును అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టు బాటు ధర కల్పించడంతో పాటు సన్నాలకు అదనంగా రూ.500 చెల్లిస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు తేమ లేకుండా ధాన్యాన్ని రైతులు తీసుకురావాలన్నారు. అనంతరం రైతులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సెక్రెటరీ సంతోష్‌కుమార్, అసిస్టెంట్ సెక్రెటరీ శ్రీనివాస్, యుడీసీ ఖాసీం, కాంగ్రెస్ నాయకులు మర్ల కర్ణాకర్‌రెడ్డి, దరావత్ ధర్మానాయక్, సైదులు, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, అధికారులు

దయాయాదవ్‌కు బీపీ మండల్ అవార్డు



హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో దయాయాదవ్‌కు అవార్డు అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

తిరుమలగిరి రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ పితామహుడు, బీహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ మండల్ పేరున ఇచ్చే బీపీ మండల్ అవార్డు మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన దయాయాదవ్‌కు లభించింది. హైదరాబాద్‌లోని బషీర్‌బాద్ ప్రెస్ క్లబ్‌లో దయాయాదవ్‌కు అవార్డును రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బీసీ సంఘం కోసం దయాయాదవ్ చేసిన కృషిని గుర్తించి అవార్డును అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీవై జాతీయ అధ్యక్షుడు రామచంద్రుయాదవ్, ఉమ్మడి నల్గొండ డీసీఎంఎస్ చెర్మన్ వట్టె జానయ్యయాదవ్, సినీ నిర్మాత శ్రీశైలంయాదవ్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్‌మండల్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

మేళ్లచెర్వు, సూర్యాపేట టౌన్ ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని మై హోం యూనిట్ హెడ్ ఎస్. శ్రీనివాసరావు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని మైహోం సిమెంట్స్ పరిశ్రమలో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల నివారణ కోసం రూ.కోటి వ్యయంతో మైహోం సంస్థ కొనుగోలు చేసిన అధునాతన అగ్నిమాపక వాహనాన్ని హుజూర్‌నగర్ అగ్నిమాపక అధికారి సుబ్బరామిరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మైహోం సంస్థ అగ్నిమాపక అధికారి లక్ష్మయ్య, అగ్నిమాపక సిబ్బంది, పరిశ్రమ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● అగ్ని ప్రమాదాలపై నివారణపై జిల్లా కేంద్రంలోని ఆర్వీ ప్రైవేట్ ఆసుపత్రిలో సిబ్బంది అగ్నిమాపక సిబ్బంది . గురువారం అవగాహ న కల్పించారు.

నాటక రంగానికి పూర్వ వైభవం తేవాలి

మఠంపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాటక రంగా నికి పూర్వ వైభవం తేవాలని నియోజకవర్గ కళాకారుల సంఘం అధ్యక్షుడు భోనగిరి ప్రకాష్‌బాబు కోరారు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగంపంతులు జయంతిని పురస్కరించుకుని గురువారం మఠంపల్లి మండల కేంద్రంలోని జ్యోతిప్రకాష్ యువజన నాట్య కళామండలి ఆధ్వర్యంలో తెలంగాన నాటక రంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రంగ స్థల సీనియర్ కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామారావు, సీనియర్ కళాకారులు షేక్ సైదులు, ధర్మయ్యగౌడ్, వెంకటశివ, కిరణ్‌యాదవ్, రాజు, రామలింగయ్య, గోపయ్యయాదవ్, జల్లు వెంకటేశ్వర్లు, ఫకీర, వీరస్వామి, విజయ్, చింతలకాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● మండల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నాయకుడు కొత్త భద్రయ్యను ఘనంగా సన్మానించారు. వివిధ పాత్రలో రాణిస్తున్న భద్రయ్యను అభినందించారు.

సంఘబంధం కమిటీ ఎన్నిక

పెన్‌పహాడ్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణగూడెం గ్రామంలో సంఘ బంధం కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ బంధం అధ్యక్షురాలిగా కటోజు జయమ్మ, ఉపాధ్యక్షురాలుగా నారాయణపుల్లమ్మ, కార్యదర్శిగా సంకరమద్ది సుకన్య, కోశాధికారిగా మామిడి మంజుల, సంయుక్త కార్యదర్శిగా దాసరి అశ్వినిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నటు క్లస్టర్ సీసీ శైలజ, ఇన్‌చార్జి ఆశలు తెలిపారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి



కోదాడలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కోదాడ టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. న్యాయవాది కిషోర్‌పై జరిగిన దాడిని కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు ఖండించారు. గురువారం పట్టణంలోని కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాృష్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, పాలేటి నాగేశ్వరరావు, యశ్వంత్, కరీముల్లా, హుస్సేన్, ధనలక్ష్మి, మురళి పాల్గొన్నారు.

అక్కడ టెక్నీషియనే డాక్టర్


(5వపేజీ తరువాయి)

చూపుతున్నారు.

ఇలా సీజ్..అలా కొత్త పేరుతో అనుమతులు

వైద్యాధికారులు ప్రైవేట్ ఆసుపత్రులపై దాడులు చేసి అనుమతులేని వాటిని సీజ్ చేస్తున్నారు. అయితే కొద్దిరోజులకే కొత్త పేరుతో మరో కొత్త భవనంలో అదే యాజమాన్యం ఆసుపత్రిని ఏర్పాటుచేస్తున్నారు. అయితే వైద్యాధికారులు జిల్లాలో నామమాత్రంగానే స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సుమారు 50 ప్రైవేట్ ఆసుపత్రులకు నోటీసులిచ్చారు. ఇందులో కేవలం 5 నుంచి 8 ఆసుపత్రులను మాత్రమే సీజ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఆసుపత్రులను సందర్శించడం లేదని ప్రజలు, రోగులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కొన్ని ఆసుపత్రులకు సరైన వైద్యులు లేకుండానే ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. సౌకర్యాలు సైతం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ముఖ్యంగా అగ్ని ప్రమాదనివారణకు ఉపయోగించే పరికరాలు కొన్ని ఆసుపత్రుల్లో కనిపించడంలేదు. వాహనాల పార్కింగ్ సైతం ఉండడంలేదు

తప్పనిసరిగా అనుమతులుతీసుకోవాలి



ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రులను నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. ఆసుపత్రిని సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేశాం. ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు లేకుంటే చర్యలు తీసుకుంటాం. అంతేకాక డయాగ్నస్టిక్ సెంటర్లు, మెడికల్ దుకాణాల్లో అర్హులైన వారిని నియమించాలి.

●కోటా చలం, డీఎంహెచ్‌వో

మే 14వ తేదీ లోపు పశువులకు టీకాలు

చిలుకూరు: జిల్లాలోని ప్రతి పశువుకు మే నెల 14వ తేదీ లోపు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి డాక్టర్ రవిప్రసాద్ అన్నారు. గురువారం చిలుకూరులోని పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.అనంతరం పదోన్నతి పొందిన పి.శ్రీవాణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పెంటయ్య పాల్గొన్నారు.

●తుంగతుర్తి: మండలంలోని వెల్లుపల్లి గ్రామంలో 156 పశువులకు గాలికుంట వ్యాధి నిరోధకలు టీకాలు వేశారు.ఈ సందర్భంగా మండల పశువైద్య అధికారి నరేష్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మే 15వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

● మద్దిరాల: గోరెంట్ల గ్రామంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పశువైద్యాధికారి శంకర్ ప్రారంభించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

తిరుమలగిరి రూరల్: పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫైరూన్నీసాబేగం అన్నారు. మండలంలోని గుండెపురి గ్రామంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవళ్లిక, స్వప్న, మల్లమ్మ, జయంతి పాల్గొన్నారు.

సంఘబంధాల రుణాల చెల్లింపులపై విచారణ

ఆత్మకూర్(ఎస్): మండలంలోని నెమ్మికల్‌లో రెండో సంఘ బంధం లావాదేవీలపై వచ్చిన సమస్యలపై జిల్లా అధికారులు గురువారం విచారణ చేశారు. స్థానిక సంఘ బంధాలు మహిళలు ఇచ్చిన ఫిర్యాదుతో ఇరువర్గాలను విచారించారు. సంఘబంధం గ్రూపుల వారు చెల్లించిన డబ్బులు సరైన సమయంలో చెల్లించనందున కొంత తేడా వచ్చినట్లు తెలిపారు. చెల్లించిన డబ్బుల్లో జమచేయడంలో జాప్యం జరడం మినహా, ఇతర తేడాలు ఏమి లేవని అధికారులు తేల్చారు. స్త్రీనిధి రుణాలను జమ చేయడంలో వీవోఏ జాప్యం చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రత్తయ్య, సీసీ చందు, సతీష్, నాగమణి, వెంకటరమణ, బీరెల్లి పరిమళ, కృష్ణవేణి, ఇందిర, కళమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

మద్దిరాల: నూతనకల్, ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని మద్దిరాల ఎంఈవో కాట్ల రవికుమార్, నూతనక్ మండలం తాళ్లసింగారం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మద్రు శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మద్దిరాల మండలంలోని ముకుందాపురం, మద్దిరాల గ్రామాల్లో, నూతనకల్ మండలంలోని తాళ్లసింగారం ఆ గ్రామంలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

సన్న బియ్యంతో పేదల జీవితాల్లో వెలుగులు

మఠంపల్లి: ప్రభుత్వం ప్రాంరంభించిన సన్న బియ్యం పంపిణీతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆదూరి కిషోర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సన్న బియ్యంతో వండిన అన్నంను తిని సంతృప్తి వ్యక్తం చేశారు.

రియల్టర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్: పట్టణంలో గురువారం రియల్టర్ల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు గోవిందరావు, కార్యదర్శిగా వట్టికూటి శ్రీనివాసు, ఉపాధ్యక్షుడిగా లింగరాజు, కోశాధికారిగా శెట్టి శ్రీనివాస్, కార్యదర్శులుగా నారబోయిన నర్సింహారావు, మధు, లక్ష్మణ్, కమిటీ సభ్యులుగా నాగేందర్‌రెడ్డి, బ్రహ్మచారి, రవి, వెంకటరత్నం, గౌరవ సలహాదారులుగా శ్రీను, సత్యనారాయణ, యోహాన్‌లను ఎన్నుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నేరేడుచర్ల: పట్టణంలోని అంజలి స్కూల్‌లో కన్వకేషన్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా. చిన్నారుల నృత్యాలు, సాంస్కృతి ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అలక సైదిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.